www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

గురు వారం
19-1-2023

సంపుటి - 07, సంచిక-235
పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole



3వ

**ఇండోనేషియాలో భారీ భూకంపం**

సునామీ హెచ్చరికలు జారీ

# ఉక్రెయిన్‌లో ఘోర ప్రమాదం



### హెలికాప్టర్ కూలిన ఘటనలో హోంమంత్రి దుర్మరణం● మరో 16మంది కూడా మృత్యువాత

**కీవ్, జనవరి 18 (సమ సమాజం):** ఉక్రెయిన్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. కీవ్ నగరంలోని బ్రోవరీ టౌన్ కిండర్‌గార్డెన్ సమీపంలో హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ఘటనలో ఉక్రెయిన్ హోంమంత్రి సహా 16 మంది దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో ఇద్దరు పిల్లలు ఉన్నారు. హోంశాఖ మంత్రి డేనిస్ మోనాస్థిరిస్కీ సహా ఆ శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన 10 మంది పిల్లలు సహా 22 మందికి హాస్పిటల్ లో ట్రీట్ మెంట్ కొనసాగిస్తున్నారు. జనావాసాల మధ్య హెలికాప్టర్ కుప్పకూలడంతో ప్రాణనష్టం ఎక్కువగా జరిగిందని అధికారులు చెప్పారు. హెలికాప్టర్ కుప్పకూలిన వెంటనే ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పక్కన ఉన్న బిల్డింగులకు మంటులు అంటుకోన్నాయి. ఘటనకు సంబంధించి సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ గా మారాయి. మృతులు, బాధితుల కుటుంబసభ్యుల రోదనలతో ఆ ప్రాంతం హృదయవిదారకంగా మారింది. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

# దద్దరిల్లిన ఖమ్మం

# బీఆర్ఎస్ సభ



### పాల్గొన్న ముఖ్యమంత్రులు, కమ్యునిస్టు నేతలు




- విశాఖ ఉక్కును కాపాడుకుంటాం
- ప్రైవేట్ పరం కానీయకుండా చూస్తా: కెసిఆర్
- యాదాద్రీశుడిని దర్శించుకున్న నేతలు
- కెసిఆర్ వెంటరాగా ఆలయంలో ప్రత్యేక పూజలు
- దర్శనానంతరం వేదాశీర్వచనం చేసిన పండితులు
- ఆలయ నిర్మాణం అద్భుతమని ప్రశంసలు
- ఉదయం సిఎంలకు ప్రగతిభవన్‌లో అల్పాహార విందు
- లబ్దిదారులకు అద్దాలు అందచేసిన పంజాబ్ సిఎం
- కార్యక్రమ ప్రాధాన్యతను వివరించిన సిఎం కెసిఆర్
- కంటి వెలుగుకు ఖమ్మంలో శ్రీకారం
- బిజెపి నేత ఆరోపణలు అవాస్తవం
- బిఆర్ఎస్ సభను డైవర్ట్ చేసే కుట్రలు
- ఎపి బిఆర్ఎస్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్

ఖమ్మం,జనవరి 18(సమసమాజం): రెండో విడుత కంటి వెలుగు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కెసిఆర్‌తో పాటు కేరళ, ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు పినరయి విజయన్, అరవింద్ కేజీవ్రాల్, భగవంత్ మాన్‌తో పాటు యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా ప్రారంభించారు. కలెక్టరేట్‌లో మొదట నేతలు ప్రారంభోత్సవం



చేశారు. అనంతరం రెండో విడుత కంటి వెలుగుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కంటి వెలుగు లబ్దిదారులు ధరవాత్ బిచ్చమ్మ, మందా అన్నపూర్ణ, రామనాథం, కోలం జ్యోతి, వెంకటేశ్వర్లు, షేక్ గౌసియా బేగంకు నేతలు సీఎం పినరయి విజనయ్, అరవింద్ కేజీవ్రాల్ భగవంత్ మాన్, సీఎం కేసీఆర్, అఖిలేశ్ యాదవ్, డీ రాజా కంటి అద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా కంటి వెలుగు కార్యక్రమం గురించి జాతీయ నేతలకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వివరించారు. రాష్ట్రంలో అంధత్వ వ్యాధులను పూర్తి స్థాయిలో నిర్మూలించడంతో పాటు కళ్లల్లో కాంతులు నింపాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తొలిసారిగా లక్షలాది మందికి కంటి పరీక్షలు నిర్వహించి అక్కడికక్కడే మందులు, కళ్లద్దాలు అందజేశారు. సమస్య తీవ్రత ఆధారంగా ఆపరేషన్ల నిమిత్తం మరికొందరిని ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానలకు సిఫారస్ చేశారు. తాజాగా రెండో విడతకు శ్రీకారం చుట్టింది. రెండో విడత కార్యక్రమం ప్రారంభం సందర్భం గా రాష్ట్ర వైద్యారోగ్యశాఖ యంత్రాంగం కొత్త కలెక్టరేట్‌లో విస్తృత ఏర్పాట్లు చేసింది. క్షేత్రస్థాయిలో కార్యక్రమ వివరాలు తెలిసేలా శిబిరాలను సిద్ధం చేశారు. రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్, కంటి పరీక్షలు, మందులు, కళ్లద్దాల పంపిణీకి సంబంధించిన టేబుల్స్‌ను స్టాల్స్ వారీగా నెలకొల్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా చేపట్టిన కంటి వెలుగు 2 విడత కార్యక్రమం ప్రారంభమైంది. పంజాబ్ సీఎం భగవంత్ మాన్ చేతుల మీదుగా కంటి వెలుగు ప్రోగ్రాంను ప్రారంభించారు. అనంతరం ఢిల్లీ సీఎం అరవింద్ కేజీవ్రాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, కేరళ సీఎం పినరయి విజయన్, యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్. సీపీఐ నేత రాజాలకు స్కీం గురించి వివరించారు. కంటి పరీక్ష చేసే విధానాన్ని ప్రత్యక్షంగా చూపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు 2 విడత కార్యక్రమం ప్రారంభమైంది. పంజాబ్ సీఎం భగవంత్ మాన్ చేతుల మీదుగా కంటి వెలుగు ప్రోగ్రాంను ప్రారంభించారు. అనంతరం ఢిల్లీ సీఎం అరవింద్ కేజీవ్రాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, కేరళ సీఎం పినరయి విజయన్, యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్. సీపీఐ నేత రాజాలకు స్కీం గురించి వివరించారు. కంటి పరీక్ష చేసే విధానాన్ని ప్రత్యక్షంగా చూపారు.

# లిక్కర్ కేసులో కవితను ఎందుకు అరెస్ట్ చేయరు



### బిఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్

జగిత్యాల,జనవరి 18(సమసమాజం): బీజేపీ, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం ఉందని బీఎస్పీ స్టేట్ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. అందుకే లిక్కర్ స్కాం కేసు ఛార్జ్ షీట్‌లో కవిత పేరు ఉన్నా ఆమెను అరెస్టు చేయడం లేదని అన్నారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా కొడిమ్యాల

3వ

# దావోస్ వేదికగా కెటిఆర్ పెట్టుబడుల వేట

**2వేల కోట్ల పెట్టుబడికి భారతీ ఎయిర్‌టెల్ అంగీకారం**

**రూ.1000 కోట్ల పెట్టుబడికి యూరోఫిన్స్ సంస్థ అంగీకారం**

**జీనోమ్ వ్యాలీలో ఆధునిక అత్యాధునిక ల్యాబ్ ఏర్పాటు**

హైదరాబాద్,జనవరి 18(సమసమాజం): తెలంగాణలో రూ. 2వేల కోట్ల పెట్టుబడికి భారతీ ఎయిర్‌టెల్ కంనెనీ ముందుకొచ్చింది. డేటా స్టోరేజి, విశ్లేషణలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించి హైపర్‌స్కేల్ డేటా సెంటర్ ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుంది. తన అనుబంధ సంస్థ అయిన నెక్స్‌ట్రా ద్వారా ఎయిర్‌టెల్ కంపెనీ ఈ పెట్టబడులు పెట్టనుంది. దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తో భారతీ ఎయిర్‌టెల్ వ్యవస్థాపకుడు సునీల్ భారతి మిట్టల్ , వైస్ ఛైర్మన్



3వ

# సంపాదకీయం

## బిజెపి కార్యవర్గంలో ప్రజా సమస్యలు చర్చ ఏదీ ?

బిజెపి మరోమారు ఎన్నికల శంఖారావం పూరించింది. 9 రాష్ట్రాల్లో విజయమే లక్ష్యంగా కార్యవర్గ సమావేశాల్లో తీర్మానం చేసుకున్నారు. ఈ ఏడాది తెలంగాణ సహా తొమ్మిది రాష్ట్రాల ఎన్నికలపై దృష్టి సారించింది. అందుకోసం బిజెపి జాతీయ అధ్యక్షుడు నడ్డా పదవీకాలాన్ని మరో ఏడాది పొడిగించారు. బిజెపి కార్యవర్గ సమావేశంలో ఈ రెండే అంశాలపైనే ప్రధానంగా చర్చ సాగాయని చెప్పాలి. ఎన్నికల్లో గెలవడం..బిజెపి అధ్యక్షుడిగా నడ్డాను కొనసాగించడం.. బిజెపికి సంబంధించినంత వరకు ఈ రెండు అంశాలు ప్రధానమైనవి. అయితే ఇవి ప్రజలకు సంబంధం లేనివే. నిజానికి ఎన్నికలకు వెళ్లేముందు దేశంతో పాటు ఆయా రాష్ట్రాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కనీసంగా అయినా చర్చించలేదు. అలాగే ఎవరు కూడా ప్రస్తావించలేదు. నిజానికి బిజెపి అధికారం చేపట్టాక ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదు. బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్న తరుణంలో కూడా ఎలాంటి హామీలు దక్కడం లేదు. మధ్యతరగతి బాధలు తనకు తెలుసన్న నిర్మలా సీతారామన్ మాటలు కూడా నమ్మశక్యంగా లేవు. దేశంలో ప్రజలు నిరుద్యోగం, జిఎస్టీ, ధరల పెరుగుదల వంటి ప్రధాన సమస్యలపై చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు. ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్ముతున్నా ప్రజలకు వివరణ ఇచ్చుకోవడంలేదు. వాటిని ఎక్కడా ప్రస్తావించడం లేదు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో పావులు కదుపడం తప్ప ప్రజలకు ఏం చేశామన్న చర్చకు బిజెపి నేతలు ముందుకు రావడం లేదు. ఇదే సందర్భంలో ఫిబ్రవరి 1న బడ్జెట్‌కు కూడా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. తెలంగాణ సహా ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో 9 రాష్ట్రాల్లో ఒక్క చోట కూడా ఓడిపోకూడదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తమ పార్టీ నాయకులకు స్పష్టం చేశారు. వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా మూడోసారి కూడా విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టేందుకు ఈ రాష్ట్రాల ఎన్నికల్లో గెలవడం అత్యంత కీలకమని భావిస్తున్నారు. ఎన్నికల వ్యూహాలు రచించేందుకు రెండ్రోజులు జరిగే బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు ఇదే ఎజెండాతో ముగిసాయి. అయితే అధికారం చేపట్టడం అన్నది ప్రజల సమస్యలు పరిష్కరించడానికే అన్న ధ్యాసలేకుండా పాలన సాగిస్తున్నారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో చరిత్రాత్మక విజయం తర్వాత హిమాచల్ కూడా ఓడిపోయామని భావించడం లేదు. అక్కడ ఎందుకు ఓడిపోయామో అన్న చర్చకు తావీయడం లేదు. స్వల్పతేడాతో విజయాన్ని చేజార్చుకున్నామని మాత్రమే సమర్థించుకుంటున్నారు. ఇవన్నీ పక్కన పెట్టి 2024 ఎన్నికల ముంగిట పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు పలు కార్యక్రమాలు చేపట్టినట్టు నడ్డా తెలియజేశారు. ప్రధాని మోదీ సారథ్యంలో భారతదేశం పురోగతి సాధించిందని ప్రశంసించారు. ప్రపంచంలోనే ఐదో ఆర్థిక శక్తిగా.. మొబైల్ ఫోన్ల ఉత్పాదనలో రెండో అతిపెద్ద ఉత్పత్తిదారుగా,ఆటోరంగంలో మూడో అతిపెద్ద మాన్యుఫ్యాక్చరర్‌గా దేశం అవతరించిందని నడ్డా చంకలు గుద్దుకున్నారు. రోజుకు 37 కిలోమీటర్ల మేర జాతీయ రహదా రుల నిర్మాణం జరుగుతోందని,గతంలో ఇది 12 కిలోమీటర్లు మాత్రమేనని కూడా ప్రకటించుకున్నారు. ఉచిత రేషన్ సహా పలు సంక్షేమ పథకాలతో పేదలకు సాధికారత అందిస్తున్నామని, గుజరాత్ ఎన్నికల్లో అసాధారణ, చరిత్రాత్మక విజయం సాధించామని విజయోత్సాహాన్ని ప్రకటించుకున్నారు. 182 అసెంబ్లీ స్థానాల్లో 156 గెలవడం గొప్ప విజయం. హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల్లో ఓడిపోయినా కాంగ్రెస్, బీజేపీ మధ్య ఓట్ల తేడా ఒక శాతం కంటే తక్కువేనని నడ్డా సమర్థించుకున్నారు. తెలంగాణ, ఇతర రాష్ట్రాల్లో గెలవడం కోసం అవలంబించాల్సిన వ్యూహాలపై చర్చలు జరిపారు. 9 రాష్ట్రాల్లో 72వేల బూత్‌ల్లో పార్టీ బలహీనంగా ఉన్నదని, కష్టపడి పనిచేస్తే అన్నిరాష్ట్రాల్లో విజయం ఖాయమని నడ్డా అన్నారు. 2023 బీజేపీకి అత్యంత ముఖ్యమైన సంవత్సరమని కూడా అన్నారు. నిజానికి ప్రజలు కోరుకుంటున్నది ఇది కాదు. బిజెపి అధికారంలోకి వస్తే అద్భుతాలు జరుగుతాయని భావించారు. కానీ అద్భుతాలు కాదుకదా ప్రజల బతుకులు దుర్భరంగా మారాయి. ప్రజలు ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారోబూత్ స్థాయిలో గుర్తించి చర్చ చేయడం లేదు. తెలంగాణనే తీసుకుంటే ఇక్కడి నేతలు కనీసం ఒక్క సమస్యను కూడా ప్రస్తావించలేక పోయారు. కిషన్ రెడ్డి కావచ్చు..బండి సంజయ్ కావచ్చు ఒక్కటంటే ఒక్క సమస్యను కూడా ప్రస్తావించ లేదు. ఎపి నుంచి అసలు సమస్యల ప్రస్తావనే లేదు. ఇవేవీ లేకుడానే ఎన్నికల్లో గెలవడం అత్యాశే తప్ప మరోటికాదు. బీజేపీ జాతీయ కార్యవవర్గ సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని మోదీ ఢిల్లీలో భారీ రోడ్ షో నిర్వహించారు. ఏమి విజయం సాధించామని రోడ్‌షో నిర్వహించారో ఆయనకే తెలియారు. ఎనమిదన్నరేళ్ల పదవీకాలం పూర్తయినా దేశంలో మౌలిక సమస్యలు గుర్తించడం లేదు. ఉత్తర ప్రదేశ్‌లో తాము గెలిచామని, పశ్చిమ బెంగాల్‌లో తమ బలం పెరిగిం దని, గుజరాత్‌లో భారీ విజయాన్ని సాధించా మని ఆనందించడం తప్ప ..బిజెపితో ప్రజలకు కలిగిన లాభమేమిటో చెప్పడం లేదు. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయా లేదా అన్నది చెప్పాలి. మోడీ రాక ముందుకు వచ్చిన తరవాత ధరల సూచీని చర్చించాలి. నిరుద్యోగంపై చర్చించాలి. కానీ అలా జరగడం లేదు. సోమవారం ప్రారంభమైన బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు మంగళవారం ముగిశాయి. ఈ కీలక సమావేశంలో మోదీ, అమిత్ షా లతో పాటు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్య మంత్రులు పాల్గొన్నారు. ఏ ఒక్కరు కూడా దేశంలోని సమస్యలను ప్రస్తావించలేదు. అంతా మోడీ భజనలో తన్మయత్వం చెందారు. పాలన బాగుందని చప్పట్లు కొట్టారు. ఇదే తరహా పాలన సాగితే మోడీకి ప్రధానిగా చేసిన పదేళ్ల అనుభవం వస్తుందే కానీ..ప్రజలు పదేళ్లుగా బాధలు పడుతున్నా పట్టింపులేని ప్రధానిగా చరిత్రలో మిగిలిపోతారు. చాయ్ అమ్మిన వ్యక్తి దేశ ప్రధాని అయితే ప్రజల దరిద్రం తీరాలి. కానీ అలా జరగలేదు. జరగదని కూడా తేలిపోయింది. సమస్యలను చర్చించని బిజెపి నేతలకు ప్రజల బాధలు పట్టవని కూడా తేలిపోయింది. ప్రజలు ఏది మంచో..ఏది చెడో ఇక ఆలోచించుకోకుంటే మోసపోతారు.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# బండి భగీరథ్‌కు స్టేషన్ బెయిల్

**పిలిచినప్పుడు రావాలని సూచించిన పోలీసులు**

**తన కుమారుడు నిర్దోషి అన్న బండి సంజయ్**



హైదరాబాద్,జనవరి18(సమసమాజం): బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ కు స్టేషన్ బెయిల్ వచ్చింది. బుధవారం దుండిగల్ పోలీసులు ఎదుట బండి భగీరథ్ హాజరయ్యాడు. టెక్ మహీంద్రా యూనివర్శిటీలో విద్యార్థుల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న కేసులో బండి భగీరథ్ బుధవారం విచారణకు హాజరయ్యాడు. పోలీసులు ప్రాథమిక విచారణ కొనసాగుతున్నందున, ఈ కేసులో పూర్తి ఆధారాలు సేకరించిన తర్వాత తదుపరి విచారణకు రావాల్సి ఉంటుందని, ఎప్పుడు హాజరు కావాలన్నదానిపై సమాచారం ఇస్తామని, ఆరోజు విచారణకు హాజరుకావాలంటూ పోలీసులు పేర్కొన్నారు. బండి భగీరథ్ తన న్యాయవాది సమక్షంలో విచారణకు హాజరయినప్పటికీ పోలీసులు విచారణ చేయలేదు. దెబ్బలు తిన్నబాధితుడు శ్రీరామ్‌ను కూడా విచారణ చేయాల్సి ఉంటుందని అతని స్టేట్‌మెంట్ రికార్డు చేసిన తర్వాత తదుపరి విచారణ జరుగుతుందని, బండి భగీరథ్ ఎప్పుడు విచారణకు రావాలన్నది సమాచారం ఇస్తామని.. ఆ రోజు విచారణకు రావాలని దుండిగల్ పోలీసులు చెప్పి పంపించివేశారు. ఇదిలావుంటే తన కుమారుడు సాయి భగరీథ్ ఎటువంటి తప్పు చేయలేదని తెలంగాణ బిజెపి అధ్యక్షుడ, కరీంనగర్ ఎంపి బండి సంజయ్ బుధవారం స్పష్టం చేశారు. ఒక విద్యార్థిపై చేయి చేసుకున్నాడన్న ఆరోపణపై భగీరథ్‌పై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేయగా ఈ సంఘటనపై బండి సంజయ్ స్పందిస్తూ తన కుమారుడి చర్యను సమర్థించారు. తన సెల్‌ఫోన్‌లోని నంబర్ తీసుకుని ఒక బాలికను వేధిస్తున్నందుకే ఆ విద్యార్థిపై తన కుమారుడు చేయిచేసుకున్నాడని సంజయ్ వివరించారు. హైదరాబాద్‌లోని యూనివర్సిటీ క్యాంపస్‌లో రెండు నెలల క్రితం ఆ సంఘటన జరిగిందని, తన కుమారుడి బ్యాచ్‌మేట్ ఒకరు ఫోన్‌లో మెసేజ్‌ల ద్వారా ఒక బాలికను వేధించాడని, ఆ వ్యవహారం అప్పుడే పరిష్కారమైందని సంజయ్ తెలిపారు.తోటి విద్యార్థిని బండి సాయి భగీరథ్ కొడుతున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దీనిపై ఒక సీనియర్ పోలీసు అధికారి స్పందిస్తూ కాలేజ్ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా బండి సంజయ్ కుమారుడు సాయి భగరథ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని, త్వరలోనే భగీరథ్‌కు నోటీసు అందచేస్తామని తెలిపారు.

# ధర్మా కారు దగ్ధం కేసులో షాకింగ్ నిజాలు

**అమాయకుడిని వెతికి కారులో దగ్ధం చేశారు● ఇన్సూరెన్స్ డబ్బుల కోసం కుటుంబంతో కలిసి ప్లాన్● ధర్మా పన్నాగాన్ని పసిగట్టిన పోలీసులు**





హైదరాబాద్,జనవరి18(సమసమాజం): ఉమ్మడి మెదక్ జిల్లాలో సంచలనం రేపిన కారు దగ్ధం కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అప్పుల బాధ నుంచి తప్పించుకునేందుకు దిద్దుకోలేని తప్పు చేసిన ధర్మానాయక్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులకు షాకింగ్ నిజాలు తెలిశాయి. ఈనెల 9న వెంకటాపూర్‌లో కారు దగ్ధం అయ్యిందనే సమాచారం అందుకుని అక్కడికివెళ్లిన పోలీసులు.. ఆ మంటల్లో ధర్మా అనే వ్యక్తి చనిపోయినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. కుటుంబసభ్యులు సైతం చనిపోయింది ధర్మానే అని చెప్పడంతో.. పోలీసులు అదే విషయాన్ని ధృవీకరించారు. అయితే, కేసు విచారణలో విస్తుపోయే విషయాలు బయటికొచ్చినట్టు పోలీసులు చెబుతున్నారు. అసలు ధర్మా చనిపోలేదనీ.. బతికే ఉన్నాడనీ గుర్తించారు. నిజామాబాద్‌లో ధర్మా తిరుగుతున్న విజువల్స్‌ని సీసీ కెమెరాల ద్వారా పసిగట్టారు. కుటుంబసభ్యుల తీరుపైనా అనుమానం రావడంతో మరింత లోతుగా విచారించి అసలు విషయం రాబట్టారు. డబ్బు సంపాదించాలనే ఆశతో అప్పులు చేసిమరీ షేర్ మార్కెట్స్‌లో పెట్టుబడులు పెట్టాడు ధర్మా. అయితే, వాటిని తీర్చేందుకు.. 7కోట్ల 40లక్షల ఇన్సూరెన్స్ డబ్బులు కొట్టేయాలని కొత్త నాటకానికి తెరలేపాడు ధర్మా. తనలా ఉన్న వ్యక్తిని చంపేసి తానే చనిపోయినట్టు నమ్మించి కోట్ల రూపాయలు నొక్కేయాలనుకున్నాడు. ఈ స్కెచ్‌ను అమలు చేసేందుకు.. ధర్మా అండ్ ఫ్యామిలీ పెద్ద ప్లానే వేశారు. అతని అక్క సునంద, అల్లుడు శ్రీనివాస్, భార్య నీల, మైనర్ కొడుకు. అంతా కలిసి.. ధర్మాలాంటి వ్యక్తి కోసం నాంపల్లి అడ్డాలో వెతికారు. అక్కడ అంజయ్య అనే వ్యక్తిని పరిచయం చేసుకున్న ధర్మా.. పని ఉందంటూ జనవరి 7న నిజామబాద్‌కు తీసుకెళ్లాడు. అయితే, అతను తాగి ఉండటంతో.. అతడు చనిపోయినా ఇన్సూరెన్స్ డబ్బులు రావని భావించి వదిలేశాడు ధర్మా. అయితే అప్పటికప్పుడు ధర్మా అల్లుడు శ్రీనివాస్ నిజామాబాద్ రైల్వే స్టేషన్ లో ధర్మాలాగే ఉన్న బాబు అనే వ్యక్తిని తీసుకొచ్చాడు. ఇంకేముంది పథకాన్ని అమలు చేసి.. అమాయకుడి ప్రాణాలు తీశారు. ఇప్పుడు పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు. నిందితులపై మొత్తం ఏడు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు పోలీసులు.



# గులాబీమయమైన ఖమ్మం నగరం

**కటౌట్లు, స్వాగత తోరణాల ఏర్పాటు● జాతీయనేతల కటౌట్ల ఏర్పాటు**

**ఎక్కడ చూసినా గులాబీ జెండాల రెపరెపలు● బిఆర్ఎస్ సభకోసం భారీగా తరలి వచ్చిన ప్రజలు**

ఖమ్మం,జనవరి18(సమసమాజం): బీఆర్ఎస్ ఏర్పాటు తర్వాత నిర్వహిస్తున్న బీఆర్ఎస్ తొలిసభకు ఖమ్మం సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. ఖమ్మం గరంతో పాటు దారి పొడవునా బిఆర్ఎస్ జెండాలు, కటౌట్లతో పట్టణం గులాబీమయం అయ్యింది. స్వాగత తోరణాలు అద్భుతంగా నిర్మించారు. ఖమ్మంలో నభూతోనభవిష్యత్ అనిపించేలా నిర్వహిస్తున్న ఈ సభకు తెలంగాణ నలుమూల నుంచే కాకుండా పొరుగురాష్ట్రాల నుంచి జనం భారీగా తరలివచ్చారు. గుంటూరు నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఖమ్మం బయలుదేరారు. ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గుంటూరు నుంచి 250 కార్లలో ప్రయాణమయ్యారు. ఉద్యమాల గుమ్మం.. ఖమ్మం గడ్డ నుంచి జాతిహితం కోసం బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ సందేశం కోసం ప్రజలు ఉత్సాహంగా చేరుకున్నారు. కేసీఆర్ ఇక్కడి నుంచే జాతికి తన సందేశాన్ని ఇవ్వనున్న కారణంగా ఖమ్మంలో ఎటు చూసినా నగరమంతా గులాబీమయమైంది. 2001లో టీఆర్ఎస్ ఆవిర్భవించిన తరువాత కరీంనగర్‌లో నిర్వహించిన తొలి బహిరంగ సభకు జేఎంఎం నేత, జార్ఖండ్ మాజీ సీఎం శిబుసోరెన్‌ను ఉద్యమ నాయకుడిగా సీఎం కేసీఆర్ ఆహ్వానించారు. నేడు ఖమ్మం సభకు ముగ్గురు ముఖ్యమంత్రులను, ఒక మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సహా పలువురు జాతీయ నేతలను సీఎం కేసీఆర్ ఖమ్మం బహిరంగసభకు ఆహ్వానించారు. ఖమ్మం బీఆర్ఎస్ సభకు దాదాపు 13 నియోజకవర్గాల నుంచి లక్షలాది మంది జనం తరలి వచ్చారు. ఖమ్మం జిల్లాలోని పాలేరు, వైరా, మధిర, ఖమ్మం, సత్తుపల్లి, ఇ÷-లలెందు నియోజకవర్గాల నుంచి జనం పెద్ద ఎత్తున తరలించారు. మహబూబాబాద్ జిల్లాలోని డోర్నకల్, మహబూబాబాద్, పాలకుర్తి, సూర్యాపేట జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల నుంచి కూడా లక్షలాది మంది స్వచ్ఛందంగా తరలివస్తుండటంతో బీఆర్ఎస్ ఏర్పాట్లు చేసింది. సభా ప్రాంగణంలో కోలాహలం నెలకొన్నది. ఉదయం నుంచే పార్టీ కార్యక్తలు సభా వేదిక వద్దకు చేరుకున్నారు. పలువురు మంత్రులు, పార్టీ ముఖ్యనేతలు ఖమ్మం పట్టణానికి చేరుకున్నారు. ఖమ్మం నగరం మొత్తం గులాబీ మయమైంది. పార్టీ ఆవిర్భావం తర్వాత నిర్వహిస్తున్న మొదటి సభ కావడంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేసారు. సభకోసం ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచేకాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు తరలివచ్చారు. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు భారీ కాన్వాయ్‌తో ఖమ్మం బయలుదేరారు. ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, అరికపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద భారీ ఎత్తున కార్యకర్తలతో హైదరాబాద్ నుంచి పయన మయ్యారు. అదేవిధంగా పాలకుర్తి నుంచి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, కరీంనగర్ నుంచి మంత్రి గంగుల కమలాకర్ రావు, మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సభకు బయలుదేరారు. ఆయా నియోజకవర్గాల నుంచి ఖమ్మం తరలివెళ్తున్న కార్యకర్తల వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఇక ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తరలివచ్చారు. ఖమ్మంలో ఎటుచూసినా బీఆర్ఎస్ జెండాలు, సీఎం కేసీఆర్‌తోపాటు పలువురు జాతీయ, రాష్ట్ర స్థాయి నేతల హోర్డింగ్‌లు, కటౌట్‌లు దర్శనమిచ్చాయి. సభావేదిక వద్దకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా చేరుకున్నారు. హబూబాబాద్ జిల్లా కేంద్రంలో సభకు తరలివెళ్తున్న వాహనాలకు ఎమ్మెల్యే శంకర్ నాయక్ జెండా ఊపి ప్రారంభించారు.

# గుజరాత్‌లో బిఆర్ఎస్ ఎందుకు పోటీచేయలేదు

**టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆరోపణ**



హైదరాబాద్,జనవరి18(సమసమాజం): బీఆర్ఎస్ జాతీయ పార్టీ అని చెప్పుకుంటున్న కేసీఆర్ గుజరాత్ ఎన్నికలలో ఎందుకు పోటీ చేయలేదని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆరోపించారు. వ్యాపార భాగస్వామైన కేజీవ్రాల్‌ను గెలిపించుకునేందుకు ఎందుకు ప్రచారం చేయలేదని అన్నారు. బీజేపీపై కొట్లాడుతామంటున్న కేసీఆర్ కాంగ్రెస్ పై ఎందుకు దాడి చేస్తున్నారని ప్రశ్నించారు. మోదీ దుర్మార్గాల్లో కేసీఆర్ భాగస్వామ్యం లేదా అని రేవంత్ నిలదీశారు. కేసీఆర్ ప్రాజెక్టులు గురించి మాట్లాడుతుంటే మేఘా కృష్ణారెడ్డి గుర్తు కొచ్చాడని విమర్శించారు. కాళేశ్వరంతో ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదని కనీసం కేసీఆర్ సొంత నియోజకవర్గం గజ్వేల్లో కూడా ఇళ్లకు త్రాగునీరు రావడం లేదని విమర్శించారు. పక్క రాష్ట్రాల రైతుల గురించి ఆలోచించే ముందు కేసీఆర్ మొదట రాష్ట్రంలోని అన్నదాతల గురించి ఆలోచించాలని హితవు పలికారు. గత ప్రధానులు 67 ఏళ్లలో రూ. 56 లక్షల కోట్లు అప్పు చేస్తే.. ప్రధాని మోదీ 8ఏళ్లలో 100 లక్షల కోట్ల అప్పు చేశారని రేవంత్ ఆరోపించారు. కాంగ్రెస్ వల్లే దేశం ఎంతో అభివృద్ధి చెందిందని, ప్రజల అవసరాల కోసం అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారని చెప్పారు. కాంగ్రెస్ 150 కోట్లతో నాగార్జున సాగర్ ప్రాజెక్టును నిర్మించడంతో పాటు లక్షా 5వేల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం, స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు, పేదలకు విద్య, వైద్యం కల్పించిన విషయాన్ని రేవంత్ గుర్తు చేశారు.

# ఎన్టీఆర్ పొలిటికల్ హీరో

**ప్రజల కోసం సాహసోపేత నిర్ణయాలు● తండ్రికి నివాళి అర్పించిన బాలకృష్ణ● కుటుంబ సభ్యుల ఘన నివాళి**



హైదరాబాద్,జనవరి18(సమసమాజం): ఎన్టీఆర్ పొలిటికల్ హీరో అని నందమూరి బాలకృష్ణ అన్నారు. ప్రజల కోసం ఎంతో సాహసోపేతమైన పథకాలు తెచ్చారని బాలయ్య గుర్తు చేశారు. పేదవాడి ఆకలి తీర్చిన అమ్మ, ఆడవారికి అండగా నిలిచిన అన్న ఎన్టీఆర్ అని వ్యాఖ్యానించారు. ఆ తల్లితండ్రులకు బిడ్డగా జన్మించడం తన అదృష్టమన్నారు. ఎన్టీఆర్ 27వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద బాలకృష్ణ నివాళులర్పించారు. టీడీపీ అనేది రాజకీయ పార్టీ కాదు.. ఒక వ్యవస్థ అని బాలకృష్ణ అన్నారు. ఎన్టీఆర్ అన్ని వర్గాల వారిని సమానంగా, సగౌరవంగా ఆదరించారని తెలిపారు. ఎన్నో ఆటుపోటులను చూసినా.. ఎన్టీఆర్ ఎప్పుడూ తల వంచలేదని చెప్పారు. ఎన్టీఆర్ సామాన్య రైతు కుటుంబంలో పుట్టి అంచలంచెలుగా ఎదిగారని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి నట ధీరుడు కనిపించడని అన్నారు. నటనలో ప్రతీ పాత్రకు ఆయన జీవం పోశారని చెప్పారు. ఎన్టీఆర్ ప్రతీ తెలుగు బిడ్డకు ఆత్మవిశ్వాసం కల్పించారని..ఎంతో మందికి రాజకీయ ఓనమాలు నేర్పారని తెలిపారు. ప్రజల హృదయాల్లో ఎన్టీఆర్ నిలిచిపోయారని, తెలుగుజాతి ఉన్నంతవరకు ఆయనను మరచిపోలేరని అన్నారు. సినీ, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. మాట తప్పని ఎన్టీఆర్ వ్యక్తిత్వం అందరికీ ఆదర్శం, తెలుగు ఖ్యాతిని ఆయన ప్రపంచానికి చాటి చెప్పారని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల, పీడిత ప్రజలకు పదవులు ఇచ్చారని అన్నారు.నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద కుటుంబ సభ్యులు నివాళులు అర్పించారు. జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణరామ్ తో పాటు పలువురు నందమూరి కుటుంబ సభ్యులు నివాళు లర్పించారు. ఎన్టీఆర్ 27వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్‌లో నందమూరి కుటుంబ సభ్యులు నివాళులు అర్పించారు. నారా భువనేశ్వరి, బాలకృష్ణ, రామకృష్ణ, సుహాసిని, జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్‌రామ్ తదితరులు ఎన్టీఆర్ ఘాట్‌కు వెళ్లి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ కుమారుడిగా పుట్టడం పూర్వజన్మ సుకృతమన్నారు. టీడీపీ రూపంలో ఎన్టీఆర్ తమకు పెద్ద కుటుంబాన్ని ఇచ్చారన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తిగా పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామని బాలయ్య పేర్కొన్నారు. సుహాసిని మాట్లాడుతూ... అందరం కలిసి పార్టీకి పునర్వైభవం తీసుకువద్దామని సుహాసిని కోరారు. ఎన్టీఆర్‌కి భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాముడైనా, రావణ బ్రహ్మ అయినా ఎన్టీఆరేనన్నారు. ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ ఎప్పటికీ నిలిచిపోతారని పేర్కొన్నారు. నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ.. 'ఆరాధ్య కథానాయకుడు, అన్నగారు నందమూరి తారక రామారావు గారికి ఘన నివాళి. నటుడిగా ఎన్టీఆర్ అనేక చారిత్రాత్మక చిత్రాలు నిర్మించారు. 1982 లో ప్రజలకు సేవ చేసేందుకు ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చారు. తెలుగు జాతి ఆత్మ గౌరవాన్ని కాపాడేందుకు ఎన్టీఆర్ కృషి చేశారు. ఎన్టీఆర్ ప్రపంచ స్థాయికి తెలుగు వారి కీర్తిని ఇనుమడించారు. ఎడిసన్ సిటీలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇది అందరికీ గర్వకారణం అని పేర్కొన్నారు. ఎన్టీఆర్‌ను తలచుకుని జూనియర్ ఎన్టీఆర్ భావోద్వేగానికి గురయ్యారు. తెలుగు వారి కోసం ఎన్టీఆర్ చేసిన సేవల్ని గుర్తు చేసుకున్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని తెలంగాణతో పాటు ఏపీలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తెలుగు తెరకు మకుటం లేని మహారాజు ఎన్టీఆర్.. వెండితెరపై రాముడైనా.. కృష్ణుడైనా.. మరే పాత్ర అయినా..ఎన్టీఆర్ చేస్తేనే ఆ పాత్రకు నిండుదనం వచ్చేది. సినిమాల్లోనే కాదు రాజకీయాల్లో తనదైన ముద్రవేసి.. పార్టీని స్థాపించి 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చారు. ముఖ్యమంత్రి పదవిని అధిరోహించారు. ఓ నటుడిగా, దర్శకుడిగా,నిర్మాతగా, రాజకీయ నాయకుడిగా , ముఖ్యమంత్రిగా ఎవరికి సాధ్యం కాని రికార్డులను సృష్టించారని కుటుంబ సభ్యులు,అభిమానులు నివాళి అర్పించారు. నందమూరి తారక రామారావు.. ఈ పేరు తెలియని సినీ ప్రేక్షకుడు ఉండడు. తెలుగు చిత్ర పరిశ్రమకే వన్నెతెచ్చిన మహనీయుడు ఎన్టీఆర్. రంగం ఏదైనా, పాత్ర ఎలాంటిదైనా ఆయన దిగనంత వరకే.. చరిత్ర సృష్టించాలన్నా.. ఆ చరిత్రను తిరగరాయాలన్నా కేవలం ఎన్టీఆర్ వలనే అవుతుంది. ఇప్పటికీ తెలుగు చిత్ర పరిశ్రమ ప్రస్తావన తెస్తే మొదట వినిపించేది నందమూరి తారక రామారావు పేరే అనడంలో ఎటువంటి సందేహం లేదు. నటుడిగా, రాజకీయ నాయకుడిగా కళామ్మ తల్లికి, ప్రజలకు ఎన్నో సేవలు చేసిన ఎన్టీఆర్ 1996, జనవరి 18న కన్నుమూశారు. ఎన్టీఆర్ 27వ వర్ధంతి కావడంతో నందమూరి అభిమానులు సహా ఆయన కుటుంబీకులు మరోసారి ఆయన పేరు గుర్తు చేసుకుంటున్నారు.

# చెల్మి తండాలో సోనూసూద్ పర్యటన

**ఘనస్వాగతం పలికిన స్థానిక ప్రజలు**

సిద్దిపేట,జనవరి18(సమసమాజం): సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం చెల్మి తండాలో సోనుసూద్ పర్యటించారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో సోనుసూద్ చేసిన సేవలకు గుర్తింపుగా ఆయనకు చెల్మి తండాలో గుడి కట్టారు. తండా వాసులు, స్థానికుల విజ్ఞప్తి మేరకు ఇవాళ చెల్మి తండాకు సోనుసూద్ వెళ్లారు. రాజకీయాలకు సంబంధం లేకుండా సహాయం చేయడంతో చెల్మీ తండా గ్రామస్తులు, యువకులు సోనుసూద్ పై మరింత అభిమానం పెంచుకున్నారు. తండా వాసులు సోనుసూద్ ను దేవుడిగా భావించి.. వారి గ్రామంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీంతో అభిమానుల పిలుపు మేరకు తండాకు వెళ్లారు. అంతకుముందు చేర్యాల పట్టణానికి చేరుకున్న సోనుసూద్ కు అభిమానులు, యువకులు ఘన స్వాగతలం పలికారు. ఆయనతో చాలామంది సెల్ఫీలు తీసుకున్నారు. చేర్యాలలో నిర్వహించిన బైక్ ర్యాలీలో సోనూసూద్ తో పాటు చాలామంది యువకులు పాల్గొన్నారు. బైక్ ర్యాలీలో అభిమానులకు అభివాదం చేస్తూ సోనుసూద్ ముందుకు సాగారు. కొందరు అభిమానులు హీరో హీరో అంటూ నినాదాలతో హోరెత్తించారు. అభిమానుల చూపిన ప్రేమకు సోనుసూద్ సంతోషం వ్యక్తం చేశారు.



# యాదాద్రీశుడిని దర్శించుకున్న నేతలు

### కెసిఆర్ వెంటరాగా ఆలయంలో ప్రత్యేక పూజలు

దర్శనానంతరం వేదాశీర్వచనం చేసిన పండితులు
ఆలయ నిర్మాణం అద్భుతమని ప్రశంసలు
ఉదయం సిఎంలకు ప్రగతిభవన్‌లో అల్పాహార విందు



యాదగిరిగుట్ట,జనవరి18(సమసమాజం): యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామివారిని కెసిఆర్ సహా మరో ముగ్గురు సీఎంలు దర్శించుకున్నారు. బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్లలో యాదాద్రి చేరుకున్న సీఎంలు కేసీఆర్, పినరయి విజయన్, అరవింద్ కేజీవ్రాల్, భగవంత్ మాన్‌కు అధికారులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆలయానికి చేరుకున్న వీరికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రులు కేసీఆర్, అరవింద్ కేజీవ్రాల్, భగవంత్ మాన్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గర్భాలయంలో స్వయంభువుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు ముఖ్యమంత్రులకు వేదాశీర్వచనం అందించారు. అధికారులు తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాలను అందజేశారు. సీఎంల టూర్ నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు దర్శనం, అర్జిత సేవలను నిలిపివేసినట్లు ఆలయ ఈవో గీత తెలిపారు. ఖమ్మంలో నిర్వహించనున్న బీఆర్ఎస్తి పార్టీ ఆవిర్భావ సభకు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ నేతలు, రైతు ప్రతినిధులు ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్నారు. బుధవారం ఉదయం వీరంతా ప్రగతిభవన్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా జాతీయ నేతలకు సీఎం కేసీఆర్ అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, కేరళ సీఎం పినరయి విజయన్, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, సీపీఐ నేత డి. రాజా సహా పలువురు నేతలు పాల్గొన్నారు.

# ఇండోనేషియాలో భారీ భూకంపం



న్యూఢిల్లీ,జనవరి18(సమసమాజం): ఇండోనేషియాలో భారీ భూకంపం సంభవించింది. బుధవారం తెల్లవారు జామున సులావేసిలో భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై భూకంపం తీవ్రత 6.1గా నమోదయింది. సులవేసి ప్రావిన్స్‌కి ఉత్తరాన 65 కి.మీ దూరంలో ఉన్న గొరొన్‌టాలోలో భూకంప కేంద్రం ఉందని యూఎస్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. సముద్రంలో 145 కిలోమీటర్ల లోతులో భూమి కంపించిందని తెలిపింది. భారీ భూంకంపంతో అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. అటు భూకంపం వల్ల ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. మరోవైపు రెండో రోజుల క్రితం కూడా ఇండోనేషియాలో భూకంపం ఏర్పడింది. సోమవారం సుమత్రా దీవుల్లో భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 6.2గా నమోదయింది. అంతకుముందు వారం రోజుల క్రితం తనింబర్ ప్రాంతంలోనూ 7.7 తీవ్రతతో భూకంపం సంభవించింది. సులవేసిలో 2018లోనూ భూకంపం ఏర్పడింది. సునామీ వల్ల 4,340 మంది మృత్యువాత పడ్డారు.

# ఢిల్లీ అసెంబ్లీలో నోట్ల కట్టల కలకలం



**తన నోరు మూయించేందుకు లంచం ఎర**

**ఆరోపణలు చేసిన ఆప్ ఎమ్మెల్యే మొహిందర్ గోయల్**

న్యూఢిల్లీ,జనవరి18(సమసమాజం): ఢిల్లీ అసెంబ్లీ మూడోరోజు బుధవారం కూడా ఆందోళన కొనసాగింది. . విదానసభలో మాట్లడేందుకు అవకాశం ఇవ్వగానే ఆప్ ఎమ్మెల్యే మొహిందర్ గోయల్ నోట్ల కట్టలను ప్రదర్శించారు. దాంతో సభలో ఒక్కసారిగా గందరగోళం చెలరేగింది. తన నోరు మూయించేందుకు మాఫియా ఇలా ప్రయత్నిస్తున్నదంటూ తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఢిల్లీ అసెంబ్లీలో ఆప్ రితాలా ఎమ్మెల్యే మొహిందర్ గోయల్ తన బ్యాగులో నుంచి రూ.15 లక్షల నోట్ల కట్టలను తీసి ప్రదర్శించారు. అనంతరం ఆ నోట్ల కట్టలను తన టేబుల్‌పై ఉంచి ప్రసంగం కొనసాగించారు. ఢిల్లీలోని దవాఖానల్లో ఉద్యోగాలను మాఫియా భర్తీ చేస్తున్నదని ఆరోపించారు. తాను మాట్లాడకుండా ఉండేందుకు వారు నాకు లంచం ఇచ్చారని చెప్తూ నోట్ల కట్టలను గాల్లో ఊపారు. కరెన్సీ కట్టలతో తనను కొనాలనే ప్రయత్నం జరిగిందన్నారు. లంచం ఇచ్చి నా గొంతు నొక్కే ప్రయత్నం జరిగిందన్న విషయాన్ని లెప్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు విన్నవించినట్లు తెలిపారు. లేఖ ద్వారా సీఎస్‌కు తెలియజేసినా చర్యలు లేవన్నారు. ఇప్పుడిలా చేయడం ద్వారా రిస్క్‌లో పడిపోయానని నాకు తెలుసునని, అయితే అవినీతిని తరిమివేయడానికే ఇలా చేశానని చెప్పుకొచ్చారు. అంబేద్కర్ దవాఖానలో సిబ్బంది నియామకం అంశాన్ని విధానసభలో గోయల్ లేవనెత్తారు. నిబంధనల ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాల్సిన వారికి ఇవ్వడం లేదని ఆరోపించారు. నర్సింగ్, ఇతర పోస్టులకు టెండర్లు వేశారని, నిబంధనలను పాతరేశారని చెప్పారు. 80 శాతం మంది పాత ఉద్యోగులకు నియామకాల్లో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉద్యోగాలు పొందిన వారి జీతాల నుంచి కాంట్రాక్టర్లు కమిషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. దవాఖానల్లో ఉద్యోగాల నియామకాల్లో మాఫియా రాజ్యమేలడం ఇదే తొలిసారని ఆయన దుయ్యబట్టారు. ఇకనైనా ఎల్జీ చర్యలు తీసుకోవాలని చెప్పడానికే ఇలా లంచం డబ్బు తీసుకొచ్చానని చెప్పారు.

# మూడు ఈశాన్య రాష్ట్రాల్లో మోగిన ఎన్నికల నగారా

**ఫిబ్రవరి 12, 15, 22వ తేదీల్లో అసెంబ్లీ ఎన్నికలు**

**మార్చి 2న కౌంటింగ్..ఫలితాల ప్రకటన**

**అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్**

న్యూఢిల్లీ,జనవరి18(సమసమాజం): మూడు ఈశాన్య రాష్ట్రాలకు ఎన్నికల నగారా మోగింది. నాగాలాండ్, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్ కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. త్రిపురలో ఫిబ్రవరి 16న పోలింగ్ జరగనుండగా.. నాగాలాండ్, మేఘాలయాలో ఫిబ్రవరి 27న ఎన్నిక నిర్వహించనున్నారు. ఈసీ షెడ్యూల్ ప్రకటించడంతో మూడు రాష్ట్రాల్లో ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చింది. నాగాలాండ్ అసెంబ్లీ కాల పరిమితి మార్చ్ 12న ముగుస్తుండగా.. మేఘాలయ, త్రిపుర అసెంబ్లీ గడువు మార్చ్ 15, 22న పూర్తికానుంది. మార్చ్ నెలఖరులోగా ఈ మూడు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. త్రిపుర, మేఘాలయా, నాగాలాండ్ రాష్ట్రాలకు చెందిన అసెంబ్లీ ఎన్నికల తేదీలను కేంద్రం ఎన్నికల సంఘం ప్రకటించింది. నాగాలాండ్, మేఘాలయా, త్రిపుర రాష్ట్రాల అసెంబ్లీలు వరుసగా ఫిబ్రవరి 12, 15, 22వ తేదీల్లో నిర్వహించనున్నట్లు సీఈసీ రాజీవ్ కుమార్ తెలిపారు. ప్రతి రాష్ట్రంలోని 60 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికలను నిర్వహించనున్నారు. ఈ మూడు రాష్ట్రాల్లో 62.8 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఈ మూడు రాష్ట్రాల్లో 1.76 లక్షల మంది ఓటర్లు తొలిసారి ఓటు వేయనున్నారు. 376 పోలింగ్ బూత్‌లు మహిళా సిబ్బంది ఆధీనంలో ఉండనున్నాయి. మూడు రాష్ట్రాల్లో నూ ఎన్నికల ఫలితాలను మార్చి 2వ తేదీన లెక్కించి ప్రకటించనున్నారు. మూడు రాష్ట్రాల శాసనసభల పదవీకాలం మార్చితో ముగియనున్న నేపథ్యంలో జనవరి 11వ తేదీన కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్‌కుమార్ నేతృత్వంలోని ఈసీ బృందం ఆ రాష్ట్రాల్లో పర్యటించింది. వరుస సమావేశాలు నిర్వహించింది. ఎన్నికలపై ఆయా రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీలు, స్థానిక యంత్రాంగం, పోలీసు సిబ్బంది అభిప్రాయాలు తీసుకుంది.

# లిక్కర్ కేసులో కవితను ఎందుకు అరెస్ట్ చేయరు



(మొదటి పేజీ తరువాయి) మండలం నాచుపల్లి, తిరుమలాపూర్, కోనాపూర్, సూరంపేట గ్రామాల్లో ఆయన పార్టీ జెండా ఆవిష్కరించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో వచ్చే సంగతేమో గానీ అది సచ్చేదిన్ మాత్రం వస్తుందని ప్రవీణ్ కుమార్ సటైర్ వేశారు. రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్లు 50శాతానికి పెంచడంతో పాటు రూ. 5వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్రం ప్రజలు పప్పన్నానికి నోచుకోని పరిస్థితిలో ఉంటే.. కేసీఆర్ 17 రకాల వంటకాలతో పక్క రాష్ట్ర నాయకులకు విందు ఏర్పాటు చేస్తున్నాడని మండిపడ్డారు. ధరణి పోర్టల్ అడ్డం పెట్టుకుని అధికార పార్టీ నాయకులు పేదల భూములు కొల్లగొడుతున్నారని ప్రవీణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌కు పంజాబ్ రైతులను పరామర్శించేందుకు టైం ఉంది కానీ కొండగట్టు బస్సు ప్రమాద బాధితులను పలకరించే తీరిక లేదా అని ప్రశ్నించారు.

# భూములు అమ్మకుండా కేంద్రం చట్టం తేవాలి

**వైసిపి రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య డిమాండ్**



హైదరాబాద్,జనవరి18(సమసమాజం): రాష్ట్రంలోని వేల కోట్ల విలువైన భూములను ప్రభుత్వం అమ్మకుండా కేంద్రం చట్టం తేవాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, వైసిపి రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. రాజకీయాల పేరుతో నాయకులు భూములు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఐఏఎస్, ఐపీఎస్లు÷- కూడా ప్రభుత్వానికి వత్తాసు పలుకుతుండటంతో వేల కోట్లు దండుకుంటున్నారని విమర్శించారు. మియాపూర్‌లోని 50 ఎకరాల స్థలాన్ని ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్‌కు కేసీఆర్ కేటాయిం చడాన్ని కృష్ణయ్య తప్పుబట్టారు. బీసీ గురుకులాలకు సొంత భవనాలు లేక బీసీలు నానా ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని కృష్ణయ్య మండిపడ్డారు. ప్రభుత్వభూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్న విషయాన్ని గుర్తు చేశారు. రు. ప్రభుత్వ భూములను కబ్జా చేసినా, అక్రమించినా బీసీ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# 20మందిని మార్చాలని అనలేదు

**తన వ్యాఖ్యలను వక్రీకరించారన్న ఎర్రబెల్లి**





వరంగల్,జనవరి18(సమసమాజం): 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మారిస్తే 100 సీట్లు గ్యారెంటీ అన్న కామెంట్స్ పై మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు స్పందించారు. తన వ్యాఖ్యల్ని వక్రీకరించారని వాపోయారు. 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉందని తాను చెప్పలేదని అన్నారు. 15 నుంచి 20 స్థానాల్లో కాంగ్రెస్, బీజేపీ నుంచి తీవ్ర పోటీ ఉంటుందని, అందుకే 20 స్థానాల్లో కొంచెం సర్దుకోవాల్సి వస్తుందని మాత్రమే చెప్పానని వివరణ ఇచ్చుకున్నారు. మీడియా తన వ్యాఖ్యలను వక్రీకరించిందని ఆరోపించారు. కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని ఎర్రబెల్లి అభిప్రాయపడ్డారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి లక్ష మంది స్వచ్ఛందంగా సభకు తరలివస్తున్నరాని చెప్పారు. రైతులు పనులు వదులుకుని సైతం బీఆర్ఎస్ సభకు వస్తున్నారని అన్నారు.

# జగిత్యాల మాస్టర్ ప్లాన్ రద్దుచేయండి

### కెటిఆర్‌కు మోతే సర్పంచ్ స్వప్న భర్త ట్వీట్



జగిత్యాల,జనవరి18(సమసమాజం): మాస్టర్ ప్లాన్ ను రద్దు చేయాలని కోరుతూ మంత్రి కేటీఆర్‌కు మోతే సర్పంచ్ స్వప్న భర్త రాజేశ్వర్ రెడ్డి ట్వీట్ చేశారు. జిల్లాలోని మోతె, ధరూర్, తిప్పన్నపేట్, నర్సింగాపూర్, తిమ్మాపూర్, హుస్నాబాద్, అంబారిపేట్ లలో మాస్టర్ ప్లాన్ ను రద్దు చేయాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఇక ఇదే విషయంపై ఆయా గ్రామాల్లో ఆందోళనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. అంబారిపేట్, హస్నాబాద్ గ్రామాల్లో తమ భూములను మాస్టర్‌ప్లాన్ నుంచి మినహాయించాలని డిమాండ్ చేస్తూ ఆయా గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా అంబారిపేట్ లో పలువురు రైతులు, గ్రామస్తులు గ్రామ పంచాయతీ బిల్డింగ్ పైకి ఎక్కి నిరసన తెలిపారు. తర్వాత ఛలో కలెక్టరేట్ కు పిలుపునిచ్చారు. దీంతో అంబారిపేట్, హస్నాబాద్ గ్రామాల్లోని బాధితులు ట్రాక్టర్లు, బైక్‌లపై జగిత్యాల జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా కొత్త బస్టాండ్ కు చేరుకుని బైఠాయించారు. కొద్దిసేపటి తర్వాత కలెక్టరేట్ కు చేరుకున్నారు. అక్కడ భారీగా మోహరించిన పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కలెక్టర్ రవిని కలిసేందుకు అనుమతి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేయడంతో ఆయన లేరని, ఒప్పుకుంటే ఐదుగురిని మాత్రమే కలవడానికి అనుమతి ఇస్తామని చెప్పారు. దీంతో ఐదుగురు వెళ్లి ఏఓ చరణ్‌కు వినతిపత్రం ఇచ్చి వచ్చారు. మరో వైపు జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామ పంచాయతీలో మాస్టర్ ప్లాన్ ను రద్దు చేయాలని తీర్మానం చేసి జగిత్యాల మున్సిపల్ ఆఫీస్ లో తీర్మాన పత్రాన్ని అందజేశారు. మొత్తంగా జగిత్యాల మంటలు కూడా ఆరడం లేదు. కామారెడ్డి లాగే ఇక్కడా ప్రజలు,రైతులు తీవ్ర ఆందోళన చేస్తున్నారు.

# దావోస్ వేదికగా కెటిఆర్ పెట్టుబడుల వేట

**(మొదటి పేజీ తరువాయి)** రాజన్ భారతి మిట్టల్ భేటీ అయ్యారు. సమావేశం అనంతరం హైదరాబాద్‌లో రూ.2వేల కోట్లతో పెట్టుబడులు పెట్టనున్నట్టు ప్రకటించారు. 60 మెగావాట్ల సామర్థ్యంతో ఈ హైపర్ స్కేల్ డేటా సెంటర్ రాబోతుంది. ఈ విషయాన్ని మంత్రి కేటీఆర్ ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. తెలంగాణలో ఎయిర్‌టెల్ పెట్టుబడులు పెట్టడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటీ, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా డిజిటల్ మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఎయిర్‌టెల్-నెక్స్‌ట్రాతో తెలంగాణ ప్రభుత్వం కలిసి పనిచేస్తుందని అన్నారు. ఇకపోతే హైదరాబాద్‌కు మరో అంతర్జాతీయ కంపెనీ వచ్చింది. అత్యాధునిక సాంకేతికత, సౌకర్యాలతో కూడిన ల్యాబ్‌ను హైదరాబాద్ జీనోమ్ వ్యాలీలో ఏర్పాటు చేస్తున్నట్టు యూరోఫిన్స్ సంస్థ ప్రకటించింది. దాదాపు రూ.1000 కోట్లతో ఈ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. హారం, పర్యావరణం, ఫార్మాస్యూటికల్, కాస్మోటిక్ ఉత్పత్తుల పరీక్షలు.. బయో అనలిటికల్ టెస్టింగ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన యూరోఫిన్స్ గ్లోబల్ లీడర్‌గా ఉంది. హైదరాబాద్‌లో ప్రారంభించే అధునాతన టెస్టింగ్ ల్యాబ్‌తో భారతీయ ఔషధ మారెట్‌లో విస్తరించబోతుంది. తన అనుబంధ సంస్థ యూరోఫిన్స్ అడ్విన‌స్ ద్వారా హైదరాబాద్‌లో ఈ ల్యాబ్‌ను యూరోఫిన్స్ ఏర్పాటు చేస్తోంది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌తో సమావేశమైన యూరోఫిన్స్ ప్రతినిధి బృందం తమ విస్తరణ ప్రణాళికలను చర్చించింది. అనంతరం యూరోఫిన్స్ సీఈవో డాక్టర్ గి÷-లలెస్ మార్టిన్ మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పాటు చేయబోయే క్యాంపస్‌తో ఔషధాల అభివృద్ధి, ఆవిష్కరణల్లో హైదరాబాద్ కేంద్రం ప్రధాన పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ జీనోమ్ వ్యాలీలో యూరోఫిన్స్ ప్రవేశిస్తున్నందుకు సంతోషంగా ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. యూరోఫిన్స్ కంపెనీకి తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతు ఇస్తుందని తెలిపారు.

# 9 రాష్ట్రాల ఎన్నికలు నడ్డాకు పరీక్ష

**రానున్నది బిజెపికి పరీక్షా కాలం**

**ప్రజల్లో కానరాని సానుకూల ధోరణి**





న్యూఢిల్లీ,జనవరి18(సమసమాజం): బిజెపి జాతీయఅధ్యక్షుడిగా రెండోమారు బాధ్యతలను భుజానికెత్తుకున్న జెపి నడ్డాకు వచ్చే ఎన్నికలు అంత సులువేమీ కాకపోవచ్చు. మొన్నటికి మొన్న సొంత రాష్ట్రం హిమాచల్‌లో బిజెపి ఓడి పోయింది. హిమాచల్‌కే చెందిన నడ్డా అక్కడ తనపార్టీని గెలిపించుకోలేక పోయారు. దీనికి కనీసంగా చర్చ కూడా చేయలేదు. అక్కడి ప్రజల్లో గూడుకట్టుకున్న అసంతృప్తిపై ఇప్పటి వరకు పార్టీ వేదికపై చర్చించిన దాఖలా లేదు. గుజరాత్‌లో గెలుపుతో దీనిని పక్కనపెట్టారు. నిజానికి గుజరాత్ విషయంలో బిజెపికి సంబంధం లేదనే చెప్పాలి. అక్కడ కేవలం మోడీ, అమిత్ షాల మేనియాతో మాత్రమే గెలిచారు. గుజరాత్‌లో అద్భుతాలు సృష్టించామని బిజెపి అనుకుంటే ప్రజలను మోసంచేయడం తప్ప మరోటి కాదు. ఈ సంవత్సరం 9 రాష్ట్రాల శాసన సభల ఎన్నికలు జరుగుతాయి. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరగనుండటంతో ఈ అసెంబ్లీ ఎన్నికలు అన్ని పార్టీలకు చాలా కీలకమైనవి. 2019లో బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన నడ్డా 2020లో పూర్తి కాలపు అధ్యక్ష పదవిని చేపట్టారు. అందరూ ఊహించినట్లుగానే ఆయనను ఆ పదవిలో కొనసాగిస్తూ ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల తరువాత కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఈ విషయాన్ని ప్రకటించారు. జేపీ నడ్డా నేతృత్వంలోనే 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పోటీ చేస్తుందని అమిత్‌షా వెల్లడించారు. జూన్ 2024 వరకు నడ్డా బీజేపీ అధ్యక్షుడిగా నడ్డా కొనసాగుతారని తెలిపారు. బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయడంలో నడ్డా కీలక పాత్ర పోషించారని అందువల్ల ఆయన నేతృత్వంలోనే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించారు. నిజానికి తెలంగాణ, ఎపిలను తీసుకుంటే ఇక్కడ బిజెపి దూకుడు రాజకీయాలు తప్ప విభజన హామీలను పట్టించుకోవడం లేదు. కర్నాటకలో అవినీతి రాజ్యం ఏలుతోంది. తెలంగాణ, బెంగాల్ రాష్ట్రాల్లో బీజేపీకి అనుకూలంగా వాతావరణం ఏర్పడిందన్న భావనలో ఉన్నారు. శవ్యాప్తంగా ప్రధాని మోదీకి పాపులారిటీని పెంచడంలో జేపీ నడ్డా సహకరించారని హోంమంత్రి అమిత్ షా అన్నారు.నిజానికి అనేక రాష్ట్రాల్లో సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ఈ క్రమంలో బిజెపి వీటిని ఎలా అధిగమిస్తుందో చెప్పడం లేదు. నడ్డాకు స్వతాహాగా పెద్దగా ఛరిష్మా లేదు. ప్రజల్లోకి వెళ్లి మాట్లాడే భాషా నైపుణ్యం కూడా లేదు. అలాంటి సందర్భంలో ఎన్నికలను గెలుస్తామని ప్రకటించడం అత్యాశే కాగలదు. నడ్డా అయినా క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని పార్టీ పరంగా ప్రభుత్వాని నివేదించే సంప్రదాయం మొదలు పెట్టాలి. అప్పుడే బిజెపికి ఇమేజ్ పెరగగలదు.

## బస్సులన్నీ ఖమ్మం సభకు తరలింపు

**బస్టాండ్లలో ప్రయాణికులు పడిగాపులు**

హైదరాబాద్,జనవరి18(సమసమాజం): సంక్రాంతి పండగకు సొంతూరుకు వచ్చి..తిరిగి గమ్యస్థానాలకు చేరుకునే ప్రయాణికులు బస్సుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, మహబూబాబాద్ జిల్లాలోని మరిపెడంతో పాటు పలు బస్ స్టాండ్లలో ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. డిపోల్లోని బస్సుల్లో దాదాపు అధిక శాతం ఖమ్మం బీఆర్ఎస్ సభకు వెళ్ళడంతో ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. ఉన్న కొన్ని బస్సులు జనంతో కిక్కిరిపోతున్నాయి. కనీసం నిలబడేందుకు కూడా చోటు లేని పరిస్థితి నెలకొంది. జగిత్యాల జిల్లా కోరుట్ల బస్ డిపోలో మొత్తం 39 బస్సులు ఉంటే అందులో 15 బస్సులు బీఆర్ఎస్ సభ కోసం కేటాయించడం గమనార్హం. మహబూబాబాద్ జిల్లాలోని మరిపెడం బస్ స్టేషన్ లోనూ ఇదే పరిస్థితి. బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. వరంగల్, మహబూబాబాద్,సూర్యాపేట, ఖమ్మం వెళ్లేందుకు బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే బస్సులు బీఆర్ఎస్ సభ కోసం కేటాయించడంతో..జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కోరుట్ల బస్టాండ్‌కు ఉదయం 8 గంటలకు వచ్చాను. ప్రయాణికులతో బస్టాండ్ నిండి ఉంది. నిజామాబాద్?కు వెళ్లేందుకు బస్సులు లేవు. పండగ కోసం వచ్చిన వారంతా తిరిగి వారి ఊర్లకు వెళ్లేందుకు వస్తున్నారు. బస్సులు సమయ పాలన పాటిస్తే బాగుంటుంది. బస్సులు లేకపోవడం వల్ల జనం ఇబ్బందులు పడుతున్నారు. మంత్రులు, ముఖ్యమంత్రుల సభలకు బస్సుల తరలింపు కరెక్ట్ కాదు.. బస్సుల్లో నిలబడేందుకు కూడా చోటు లేని పరిస్థితి... ప్రయాణికుడు, కోరుట్ల బస్టాండ్ బీఆర్ఎస్ పార్టీ స్థాపించి జాతీయ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ మొదటి సారిగా ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. అలాగే యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, సీపీఐ జాతీయ కార్యదర్శి రాజా తదితరులు రానున్నారు. సభకు 20 వేల మంది వీఐపీలు, వెయ్యి మంది వీవీఐపీలు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సభకు ఆర్టీసీ బస్సుల ద్వారా బీఆర్ఎస్ పార్టీ జన సమీకరణ చేస్తోంది.



# భరత్ విజయం

## లోకల్ బాయ్ శిరజ్ బౌలింగ్ అదుర్స్







- ఉత్కంఠ పోరులో భారత్ గెలుపు
- నరాలు తెగే టెన్షన్‌లో వరించిన విజయం
- చివరి ఓవర్‌లో బ్రేస్‌వెల్ ఔట్.. 12 పరుగుల తేడాతో విజయం
- బౌలర్లకు చుక్కలు చూపి సెంచరీ కొట్టిన ఆల్‌రౌండర్ బ్రేస్‌వెల్
- ఉప్పల్ స్టేడియంలో పరుగుల వరద
- ఇండియా 349..కివీస్ 337 పరుగుల
- ఎంజాయ్ చేసిన హైదరాబాద్ క్రికెట్ లవర్స్

**హైదరాబాద్,జనవరి18(సమసమాజం):** ఓటమి అంచునుంచి..విజయం దక్కింది. ఉత్కంఠపోరులో చివరి ఓవర్ వరకు ఓటమి తప్పదనుకున్న సమయంలో హమ్మయ్య అనుకునేలా విజయం చేజిక్కింది. ఉప్పల్ స్టేడియం వేదికగా న్యూజిలాండ్, టీమిండియా జట్ల మధ్య జరిగిన తొలి వన్డేలో టీమిండియాకు థ్రిల్లింగ్ విక్టరీ దక్కింది. నరాలు తెగే ఉత్కంఠతో సాగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా 12 పరుగుల తేడాతో విజయం సాధించింది. టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 349 పరుగులు సాధించి 350 పరుగుల టార్గెట్‌ను కివీజ్ ముందుంచింది. 350 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ ఆరంభంలోనే తడబడింది. 70 పరుగులకే ఓపెనర్లు కాన్వే (10), అలెన్ (40) ఇద్దరి వికెట్లను కోల్పోయింది. ఆ తర్వాత హెన్రీ నికోలస్ (18), మిచెల్ (9), కివీస్ కెప్టెన్ టామ్ లాథమ్ (24), ÷-లగెన్ ఫిలిప్స్ (11) పరుగులకే ఔట్ కావడంతో కివీస్ 131 పరుగులకే ఆరు కీలక వికెట్లను కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే.. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆల్‌రౌండర్ బ్రేస్‌వెల్, శాంట్నర్ పిల్లర్ల మాదిరిగా నిలబడ్డారు. ఈ ఇద్దరూ కలిసి చేసిన బీభత్సం అంతాఇంతా కాదు. గెలుపుపై ఆశలు వదిలేసుకున్న కివీస్ అభిమానుల్లో మళ్లీ ఆశలు చిగురించేలా చేశారు. బ్రేస్‌వెల్, శాంట్నర్ కలిసి 162 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. శాంట్నర్ 57 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద సిరాజ్ బౌలింగ్‌లో సూర్యకుమార్ యాదవ్‌కు క్యాచ్‌గా చిక్కడంతో పెవిలియన్‌కు వెళ్లక తప్పలేదు. ఆ తర్వాత కూడా బ్రేస్‌వెల్ దూకుడుగానే ఆడాడు. సిక్సులతో చెలరేగాడు. 78 బంతుల్లో 12 ఫోర్లు, 10 సిక్సర్లతో సెంచరీ చేశాడంటే టీమిండియా బౌలర్లపై ఏరేంజ్‌లో విరుచుకుపడ్డాడో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. చివరి ఓవర్‌లో 5 బంతుల్లో 13 పరుగులు కొడితే న్యూజిలాండ్ విన్ అయ్యే పరిస్థితులున్నప్పుడు శార్దూల్ బౌలింగ్‌లో బ్రేస్‌వెల్ ఎల్బీగా ఔట్ కావడంతో కివీస్ 337 పరుగులకు ఆలౌట్ అయింది. టీమిండియాకు విజయం దక్కింది.బ్రేస్‌వెల్ సెంచరీ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పడంతో గిల్ డబుల్ సెంచరీ ఎక్కడ వృథా అవుతుందోనని టీమిండియా అభిమానులు ఆందోళన చెందారు. సిరాజ్ 10 ఓవర్లలో 46 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లు తీయడంతో టీమిండియా గెలుపు ముంగిట నిలిచింది. టీమిండియా బ్యాటింగ్‌లో గిల్ డబుల్ సెంచరీ ఎంత కీలకమో, బౌలింగ్‌లో ఈ హైదరాబాద్ కుర్రాడి పాత్ర కూడా అంతే కీలకమని చెప్పొచ్చు. టీమిండియా బౌలర్లలో సిరాజ్ 4 వికెట్లతో రాణించగా, కుల్దీప్ యాదవ్‌కు 2 వికెట్లు, శార్దూల్ ఠాకూర్‌కు 2 వికెట్లు, షమీకి ఒక వికెట్ దక్కింది.







## సార్ మూవీలో బంజారా పాట

ఇప్పటివరకు డబ్బింగ్ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన ధనుష్..'సార్' చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కుతోంది. సంయుక్త మీనన్ హీరోయిన్. సూర్య దేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తిచేసిన టీమ్.. మరోవైపు మ్యూజికల్ ప్రమోషన్స్‌ను కూడా స్టార్ట్ చేసింది. ఆల్రెడీ 'మాస్టారూ' పాటను రిలీజ్ చేయగా.. మంగళవారం 'బంజారా' సాంగ్‌ను విడుదల చేశారు. జీవీ ప్రకాష్ కుమార్ కంపోజ్ చేసిన సాంగ్‌కు ఆలోచింపజేసేలా లిరిక్స్ రాశారు సుద్దాల అశోక్ తేజ. 'ఆడవుంది నీవే, ఈడ ఉంది నీవే.. నీది కానీ చోటే లేనేలేదు బంజారా.. యాడ పుట్టె తీగ, యాడ పుట్టె బూర.. తోడు కూడినాక మీటి చూడు తంబూర' అంటూ సుద్దాల రాసిన పదాలు ఇంప్రెస్ చేస్తున్నాయి. 'ఏదీ మన సొంతం కాదు.. కష్టాలు, సుఖాలు శాశ్వతం కాదు.. ఈ క్షణాన్ని ఆస్వాదించడమే జీవితం' అని పదునైన పదాలతో, లైఫ్ ఫిలాసఫీ చెబుతున్నట్టుగా ఉన్నాయి లిరిక్స్. అనురాగ్ కులకర్ణి పాడిన తీరు పాటకు హైలైట్. లెక్చరర్ పాత్రలో ధనుష్ చేసిన సింపుల్ మూమెంట్స్, విలేజ్ లొకేషన్స్ ఆకట్టుకున్నాయి. సాయికుమార్, తనికెళ్ల భరణి, సముద్ర ఖని ఇతర పాత్రల్లో కనిపించనున్నారు. ఫిబ్రవరి 17న సినిమా విడుదల కానుంది.





## ఆకట్టుకోలేక పోతున్న ఆదిపురుష్ రిలీజ్ పోస్టర్

అభిమానుల్లో ఓ సినిమాపై ఇంట్రెస్ట్ క్రియేట్ చేయాలంటే ఆ సినిమాకు సంబంధించి నటీనటులతో పాటు కథ కూడా బాగుండాలి. అలాగే మోషన్ పోస్టర్ గ్లింప్స్ టీజర్లు ట్రైలర్లు... అద్భుతంగా ఉండాలి. వాటిని చూసే చాలా మంది సినిమాలపై ఆసక్తి ఏర్పడుతుంది. కానీ ఇవే బాగాలేకపోతే సినిమాపైనే ఎఫెక్ట్ పడుతుంది. ఆది పురుష్ సినిమాకు కూడా ఇదే జరిగింది. ట్రైలర్ ఒక్కటి బాలేకపోవడంతో సినిమాపైనే తీవ్ర ప్రభావం పడింది. ఆదిపురుష్ సినిమాలో డార్లింగ్ ప్రభాస్ శ్రీరాముడిగా కృతి సనన్ సీతగా కనిపించగా.. సైఫ్ అలీఖాన్ రావణుడి పాత్రను పోషించారు. ట్రైలర్ లాంచ్ అయిన తర్వాత విపరీతమైన నెగిటివ్ టాక్ రావడంతో సినిమాను ఆరు నెలల పాటు వాయిదా వేసిందీ చిత్రబృందం. ముందుగా జనవరి 12వ తేదీన సినిమా రిలీజ్ చేద్దాం అనుకున్నప్పటికీ.. వాయిదా పడడంతో జూన్ 16వ తేదీన సినిమాను రిలీజ్ చేస్తామని ఆదిపురుష్ టీం ప్రకటించింది. ఈ క్రమంలోనే 150ఆజాబబినీంటతూబీసబీబర అనే హ్యాష్ ట్యాగ్ తో సినిమాను ట్రెండ్ చేయడం ప్రారంభించారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ పోస్టర్ ను కూడా విడుదల చేశారు. కానీ అనుకున్న రేంజ్ లో దీనికి రెస్పాన్స్ రాలేదు. అయితే గతంలో రిలీజ్ చేసిన టీజర్ పై విమర్శలు రావడంతో సినిమా వీఎఫ్ఎక్స్ ను మార్చారు మూవీ మేకర్స్. ఆ పని పూర్తి కావడంతో ఇప్పుడు హ్యాష్ ట్యాగ్ సినిమాను ట్రెండ్ చేయాలనుకున్నారు. కానీ కొత్త ట్రైలర్ కు బదులుగా ఇలాంటి హ్యాష్ టాగ్స్ ఇవ్వడంతో అభిమానులు పెద్దగా ఆసక్తి చూపిచడం లేదు. ఇప్పటికైనా ఇలా హ్యాష్ ట్యాగ్ లు పోస్టర్ లతో కాకుండా అద్భుతమైన వీఎఫ్ఎక్స్ తో కూడిన ట్రైలర్ ను రిలీజ్ చేయాలని పలువురు అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అప్పుడే సినిమాపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతుందని సూచిస్తున్నారు. మరి చిత్ర బృందం సినిమాకు సంబంధించిన కొత్త ట్రైలర్ ను ఎప్పుడు విడుదల చేస్తారో లేదా చూడాలి.

## మైఖేల్ సినిమాలో అనసూయ కీ రోల్




రంగస్థలం సినిమాతో టాలీవుడ్‌లో హీరోయిన్స్ రేంజ్‌లో గుర్తింపును దక్కించుకున్న ముద్దుగుమ్మ అనసూయ. జబర్దస్త్ కు గుడ్ బై చెప్పేసి అనసూయ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతోంది. ప్రస్తుతం ఈ అమ్మడి యొక్క మైఖేల్ సినిమా లోని క్వీన్ లుక్ వైరల్ అవుతోంది. యంగ్ హీరో సందీప్ కిషన్ హీరోగా తమిళ స్టార్ నటుడు విజయ్ సేతుపతి కీలక పాత్రలో నటిస్తున్న మైఖేల్ సినిమాలో అనసూయ కీలక పాత్రలో నటిస్తున్నట్లుగా చిత్ర యూనిట్ సభ్యులు ఈ పోస్టర్ ను విడుదల చేసారు. అనసూయ కు ఒక ప్రత్యేక పోస్టర్ ను విడుదల చేయడం ద్వారా మైఖేల్ యూనిట్ సభ్యులు అనసూయకు ఎంతటి ప్రాముఖ్యత ఇవ్వడం జరిగిందో అర్థం చేసుకోవచ్చు. అంటే సినిమాలో అనసూయ పాత్ర కచ్చితంగా ది బెస్ట్ అన్నట్లుగా ఉంటుంది అంటూ అభిమానులు చాలా నమ్మకంతో ఉన్నారు.ఈ సినిమాలో సందీప్ కిషన్ లుక్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. సందీప్ మరియు విజయ్ సేతుపతి కాంబోలోని సన్నివేశాలు సినిమాలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి అంటూ చిత్ర యూనిట్ సభ్యులు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమాను ఫిబ్రవరి 3వ తారీకున తెలుగు తో పాటు తమిళం ఇతర సౌత్ భాష ల్లో కూడా విడుదల చేయబోతున్నట్లుగా తెలుస్తోంది.ఈ సినిమా ఇప్పటికే ప్రేక్షకుల్లో పాజిటివ్ బజ్ ను క్రియేట్ చేసింది. అనసూయ పోస్టర్ రిలీజ్ తో మరింతగా మైఖేల్ పై జనాల్లో ఆసక్తి పెరిగింది అంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.

## వరుస సినిమాలతో రష్మిక దూకుడు

శ్రీవల్లిగా ప్యాన్ ఇండియా వైడ్‌గా ఫేమ్ తెచ్చుకున్న రష్మిక మందాన్న.. సౌత్, నార్త్ అనే తేడా లేకుండా బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉంది. రీసెంట్‌గా 'వారసుడు' చిత్రంలో కనిపించిన ఆమె.. సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్‌లో 'యానిమల్' కంప్లీట్ చేసే పనిలో ఉంది. మరోవైపు ఆమెను ప్రతి ఒక్కరూ 'పుష్ప2' అప్‌డేట్‌ను అడుగుతుంటే.. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆ సినిమా గురించి మాట్లాడింది. ఇప్పటికే షూటింగ్ మొదలైందన్న రష్మిక.. ఫిబ్రవరి నుంచి తాను సెట్స్‌లో జాయిన్ అవనున్నట్టు చెప్పింది. అంతేకాదు సెకెండ్ పార్ట్ కోసం అందరిలాగే తాను కూడా వెయిట్ చేస్తున్నానంది. 'పుష్ప'లో డీ గ్లామరస్‌గా కనిపించిన రష్మిక.. తనదైన నటనతో ప్రేక్షకుల నుంచి మంచి మార్కులే రాబట్టింది. బన్నీ, రష్మిక కాంబోలో వచ్చిన 'సామి సామి' పాట యూట్యూబ్‌ను షేక్ చేసింది. వీళ్లిద్దరి పెళ్లితో ఫస్ట్ పార్ట్‌కి ఎండింగ్ ఇచ్చిన సుకుమార్.. సీక్వెల్‌లో ఈ జంటను ఎలా చూపించబోతున్నారనే ఆసక్తి నెలకొంది.



Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in